సాక్షి
ఒడిశా
శుక్రవారం । 3 । మే । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,45,762లు, బంగారం 200 మిల్లీగ్రాములు, వెండి 27 గ్రాముల 500 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



జోరుగా.. నామినేషన్లు

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి మరో విడత పోలింగ్‌కు గురువారం రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున నామినేషన్లు దాఖలయ్యాయి.

- 8లో



ఎక్సైజ్ సిబ్బంది దాడులు

రాయగడ జిల్లాలోని కాశీపూర్ సమితి పటముండ గ్రామంలో ఎక్సైజ్ సిబ్బంది గురువారం దాడులను నిర్వహించారు.

- 8లో

సత్తా చాటాలని..!

- కంటాబంజీ స్థానానికి సీఎం నవీన్ నామినేషన్
- కాంగ్రెస్ కంచుకోటగా ఉన్న స్థానంలో పోటీ
- పశ్చిమ ఒడిశాలో బల నిరూపణకు అవకాశం



నామినేషన్ పురస్కరించుకొని సంతకం చేస్తున్న సీఎం నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: పశ్చిమ ఒడిశాలో భీకర రాజకీయ పోరుకు రంగం సిద్ధమైంది. ముఖ్యమంత్రి, బిజూ జనతా దళ్ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ గురువారం టిట్లాగడ్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో కంటాబంజీ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీకి నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. తమ ప్రియతమ నేతకు స్వాగతం పలికేందుకు దారి పొడవునా పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. కంటాబంజీ నామినేషన్‌తో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సవాలుతో కూడిన రాజకీయ యాత్రకు శంఖారావం చేశారు.

కాంగ్రెస్ కంచుకోట పడగొట్టాలని బిజూ జనతా దళ్ కంచుకోటగా గంజాం జిల్లా హింజిలి నిరూపితం. యథాతథంగా నవీన్ పట్నాయక్ ఈ నియోజకవర్గం నుంచి మొదటి నామినేషన్ దాఖలు చేశారు. రెండో నామినేషను పశ్చిమ ఒడిశా కంటాబంజీ నుంచి పోటీకి నామినేషన్ దాఖలు చేసి భీకర పోరుకు రంగ ప్రవేశం చేశారు. నవీన్ ప్రవేశంతో ఈ నియోజకవర్గంలో పోరు తారాస్థాయిలో ఉంటుందని అంచనా. గత 2019 ఎన్నికల్లో బిజూ జనతా దళ్ కంటాబంజీ అసెంబ్లీ స్థానంలో మూడో స్థానంలో నిలిచింది. ఈ పరిస్థితిని అధిగమించి యావత్తు పశ్చిమ ఒడిశాలో తమ పార్టీ ఉనికిని బలోపేతం చేయడమే ధ్యేయంగా బీజేడీ అధినేత ప్రత్యక్షంగా రంగంలోకి దిగారు. కంటాబంజి నియోజకవర్గం కాంగ్రెసు కంచుకోటగా చలామణి అవుతుంది. మరోవైపు ఈ నియోజకవర్గంతో కూడిన బొలంగీరు లోక్‌సభ స్థానం భారతీయ జనతా పార్టీ అధీనంలో ఉంది. ఈ పోరులో గెలుపు సాధించి బొలంగీరు లోక్‌సభ ఎన్నికని ప్రభావితం చేసి యావత్తు పశ్చిమ ఒడిశాలో నవీన్ గ్లామర్‌ని తళుక్కుమనిపించే ఉత్సాహంతో నామినేషన్ దాఖలు చేశారు. నవీన్ పట్నాయక్ పోటీ పశ్చిమ ఒడిశాలో సమగ్ర రాజకీయ ముఖ చిత్రానికి కొత్త కవలికలు దిద్దుతుందనడంలో సందేహం లేదు.



రిటర్నింగ్ అధికారికి నామినేషను పత్రాలు అందజేస్తున్న నవీన్ పట్నాయక్

బొలంగీర్‌లో బీజేపీ

భారతీయ జనతా పార్టీకి చెందిన సంగీతా కుమారి సింగ్ దేవ్ బలంగీర్ లోక్‌సభ సభ్యురాలిగా కొనసాగుతున్నారు. ఈ స్థానం పరిధిలో కంటాబంజీ అసెంబ్లీ సెగ్మెంటు ఒకటి. బొలంగీర్ లోక్‌సభ స్థానంలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్లలో సంగీతా కుమారి సింగ్ దేవ్‌కు కంటాబంజీ అసెంబ్లీ సెగ్మెంటులో అత్యధిక ఆదరణ లభించింది. 2019లో బీజేపీ అభ్యర్థిగా సంగీతా సింగ్‌దేవ్‌కు కంటాబంజీ సెగ్మెంట్ నుంచి అత్యధికంగా 33,765 ఓట్లు లభించాయి. ఈ పార్లమెంటరీ స్థానంలో మరో కీలక అసెంబ్లీ సెగ్మెంటు పట్నగాడా. ఈ నియోజకవర్గానికి ఆమె భర్త కనక వర్ధన్ సింగ్‌దేవ్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. సంగీతా సింగ్‌దేవ్‌కు ఈ పట్నగాడా నుంచి 7,983 ఓట్లు పోలయ్యాయి. 2019లో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ తన సొంత ఇలాఖా గంజాం జిల్లా హింజిలితో పశ్చిమ ఒడిశా బర్‌గడ్ జిల్లా బీజేపూర్ నుంచి పోటీ చేశారు. దీంతో అప్పటివరకు కాంగ్రెసు అధీనంలో ఉన్న బీజేపూర్ శాసనసభ స్థానం బీజేడీ ఖాతాలో పదిలమైంది. ఈసారి ఆయన హింజిలితో పాటు బొలంగీర్ జిల్లా కంటాబంజీ నుంచి పోటీ చేయడం మరో విప్లవాత్మక మార్పుని ఆవిష్కరిస్తుందని భావిస్తున్నారు.

న్యూస్‌రీల్

ఇసుక తరలిస్తున్న వాహనాలు సీజ్



సీజ్ చేసిన వాహనాలు

బరంపురం: యథేచ్ఛగా ఇసుక, కంకర అక్రమంగా రవాణా చేస్తున్న వాహనాలపై పోలీసులు దాడులు జరిపి 10 వాహనాలను సీజ్ చేయడంతో పాటు 11 మందిని అరెస్టు చేసినట్లు టౌన్ ఎస్డీపీవో జయంత్ కుమార్ మహాపాత్రో గురువారం తెలిపారు. సదర్ పోలీసుస్టేషన్ పరిధి కుకుడాఖండి బ్లాక్‌లోని శంకర్ ఐ ఆస్పత్రి జంక్షన్ దగ్గర వాహనాలను సీజ్ చేసినట్లు వెల్లడించారు. ఎవరైనా అక్రమంగా రవాణాకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న మహిళలు

రాయగడ: అంతర్జాతీయ మానవ హక్కుల కౌన్సిల్ రాయగడ శాఖ ఆధ్వర్యంలో స్థానిక రింగ్‌రోడ్డు వద్ద మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఆ కౌన్సిల్‌కు చెందిన లీనా సేనాపతి ఆధ్వర్యంలో జరిగిన పంపిణీ కార్యక్రమంలో బాటసారులు మజ్జిగ సేవించి కాస్తంత ఉపశమనం పొందారు. ఇటువంటి తరహా కార్యక్రమాలను ఇకపై తరచూ నిర్వహిస్తామని సేనాపతి పేర్కొన్నారు.

చోరీ కేసు నిందితుడు అరెస్టు



అరెస్టైన రిత్ టికిరి

రాయగడ: చోరీ కేసు నిందితుడిని జిల్లాలోని అంబొదల పోలీసులు గురువారం అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. అరెస్టైన వ్యక్తి బిసంకటక్ పోలీస్‌స్టేషన్ పరిధి బారిగుడ గ్రామానికి చెందిన రితిక్ టకిరిగా గుర్తించారు. అతని వద్ద నుంచి రూ.25 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. బారిగుడ గ్రామంలో నివాసముంటున్న భీమా బాగ్ అనే వ్యక్తి ఇంట్లో ఏప్రిల్ 28వ తేదీన చోరీ జరిగింది. ఇంట్లో ఉన్నటువంటి రూ.30,500 నగదును తన బంధువు అయిన, రితిక్ టకిరి అనే వ్యక్తి దొంగిలించుకుపోయాడని బాధితుడు అంబొదల పోలీస్ స్టేషన్‌లో 30వ తేదీన ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో పోలీసులు దర్యాప్తు చేసి, నిందితుడిని పట్టుకున్నారు.

భారీగా గంజాయి సీజ్



స్వాధీనం చేసుకున్న గంజాయి, అరెస్టైన నిందితులతో ఎక్సైజ్ అధికారులు

బరంపురం: నగరానికి అక్రమంగా రవాణా చేస్తున్న రూ.85 లక్షలు విలువ చేసే గంజాయిని బరంపురం ఎక్సైజ్ అధికారులు పట్టుకున్న ఘటన జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఎక్సైజ్ అధికారి తపన్ కుమార్ నాయక్ తెలిపిన వివరాల మేరకు.. కొందమాల్ జిల్లా దరింగబడి నుంచి బరంపురం నగరానికి కారు, ట్రక్కు, రెండు ద్విచక్ర వాహనాల్లో అక్రమంగా గంజాయి తరలిస్తున్నట్లు పోలీసులకు రహస్య సమాచారం అందింది. దీంతో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. దీనిలో భాగంగా రూ.85 లక్షలు స్వాధీనం చేసుకొని, ముగ్గురిని అరెస్టు చేశారు. వారిపై కేసు నమోదు చేశారు.

బీజేడీ అభ్యర్థుల తుది జాబితా విడుదల

భువనేశ్వర్: రాష్ట్రంలో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల తుది జాబితాను బిజూ జనతా దళ్ (బీజేడీ) గురువారం విడుదల చేసింది. ముఖ్యమంత్రి, బీజేడీ అధినేత నవీన్ పట్నాయక్ మూడు ఎమ్మెల్యే స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. వీటిలో ఖండపడ, నీలగిరి, కొరేయ్ శాసన సభ స్థానాలు ఉన్నాయి. ఈ సందర్భంగా దేవ్‌గఢ్ అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రకటించిన అభ్యర్థిని మార్చినట్లు పేర్కొన్నారు. ఖండపడ అసెంబ్లీ స్థానానికి సావిత్రి ప్రధాన్ ఖరారు చేయగా నీలగిరి స్థానంలో సుకాంత నాయక్, కొరెయిలో బీజేడీ అభ్యర్థిగా సంధ్యారాణి దాస్ పోటీ చేయనున్నట్లు పేర్కొన్నారు. సంధ్యారాణి దాస్ బీజేడీ సంస్థాగత కార్యదర్శి, సంబల్‌పూర్ లోక్‌సభ స్థానానికి పార్టీ అభ్యర్థిగా బరిలో ఉన్న ప్రణబ్ ప్రకాష్ దాస్ తల్లి కావడం విశేషం. దేవ్‌గఢ్ అసెంబ్లీ నియోజకవర్గానికి బీజేడీ అభ్యర్థిగా అరుంధతీ దేవి స్థానంలో రోమాంచ్ రంజన్ బిస్వాల్‌ను బరిలోకి దింపుతున్నట్లు తుది జాబితాలో స్పష్టం చేశారు.

ముమ్మరంగా నెక్కంటి ప్రచారం



వార్డుల్లో ప్రసంగిస్తున్న నెక్కంటి

రాయగడ: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా అధికార బీజేడీ మున్సిపాలిటీ పరిధి ఓటర్లను ఆకర్షించుకునే ప్రయత్నం చేస్తోంది. ఈ క్రమంలో బీజేడీ జిల్లా అధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావు, రాయగడ శాసనసభ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న అనసూయ మాఝిలు మున్సిపాలిటీ పరిధిలోని 15, 16 వార్డుల్లో బుధవారం సాయంత్రం ముమ్మరంగా ఎన్నికల ప్రచారాన్ని కొనసాగించారు. ఇంటింటా తిరిగి శంఖం గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రతీసారి మున్సిపాలిటీ ఎన్నికల్లో బీజేడీ పార్టీకి మద్దతు పలుకుతున్న పట్టణ ప్రజలు, ఈసారి కూడా అదేదిశగా అడుగులు వేసి అభివృద్ధికి నాంది పలకాలని పిలుపునిస్తున్నారు. వార్డుల వారీగా ప్రచారాన్ని కొనసాగిస్తున్న బీజేడీ ఆయా వార్డుల్లో సమావేశాలు నిర్వహించి సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. మహిళల ఆర్థిక, సామాజిక రంగాల అభివృద్ధికి పెద్దపీట వేసిన నవీన్ సర్కార్ ఈసారి అధికారంలోకి వస్తే మహిళల కోసం మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని హామీ ఇచ్చారు.



అనసూయా మాఝికి అభినందనలు తెలుపుతున్న మహిళలు

మోసపోకండి.. మార్పు తీసుకురండి



మాట్లాడుతున్న తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పక్కనే సప్తగిరి, అప్పలస్వామి, మహంతి

- తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

రాయగడ: రాష్ట్ర ప్రజలు సీఎం నవీన్ పట్నాయక్ పాలనను ఇంకా నమ్ముతున్నారని, ఆయనపై అభిమానంతో ఓటు వేసి గెలిపిస్తే మరొకరు రాష్ట్రాన్ని పాలిస్తున్నారని, ఇంకా మోసపోకండి మార్పు తీసుకురండని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా ప్రచారం చేయడానికి వచ్చిన ఆయన గురువారం స్థానిక తేజస్వి హోటల్‌లో విలేకర్లతో మాట్లాడారు. బీజేడీకి ప్రజలు గుడ్‌బై చెప్పాలన్నారు. దాదాపు 25 ఏళ్ల రాష్ట్రాన్ని పాలించిన నవీన్ పట్నాయక్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు చేసిందేమీ లేదని అన్నారు.

బాక్సైట్ నిక్షేపాలు గుత్తేదారులకు తాకట్టు..

ఖనిజ, ప్రకృతి సంపదలకు నిలయమైన రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతి ఏమాత్రం కనిపించడం లేదన్నారు. ముఖ్యంగా రాయగడ వంటి జిల్లాలోని బాక్సైట్ గనులను అదాని, వేదంత్ వంటి కంపెనీలకు తాకట్టుపెట్టి చోద్యం చూస్తున్న ఈ ప్రభుత్వానికి కాలం చెల్లిందన్నారు. బాక్సైట్ వంటి నిక్షేపాలు ఉన్న ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందాల్సి ఉన్నప్పటికీ అయా అనావాళ్లు అసలు కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. నిరుద్యోగ సమస్య ఎక్కువగా ఉందన్నారు. పారిశ్రామిక ప్రగతితోనే నిరుద్యోగ సమస్యను నిర్మూలించగలమన్నారు.

హామీలను నెరవేర్చే పార్టీ కాంగ్రెస్..

ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే పార్టీ కేవలం కాంగ్రెస్ మాత్రమేనని, ఈసారి రాష్ట్ర ప్రజలు ఆశీర్వదించాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తుందన్నారు. మహిళల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను అమలు చేసిందన్నారు. మహిళల కోసం ఉచితంగా ఆర్టీసీ బస్సు సేవలు అందిస్తున్నామన్నారు. రూ.500 లకే వంట గ్యాస్‌ను అందిస్తున్నామని వివరించారు. రెండు వందల యూనిట్ల లోపల ఉచిత విద్యుత్‌ను ఇస్తూ ప్రజల మెప్పు పొందుతున్నామన్నారు. అలాగే రైతులను ఆదుకుంటున్నామని వివరించారు. తెలంగాణలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా పనిచేస్తున్న కాంగ్రెస్ పార్టీకి మద్దతు పలకాలని పిలుపునిచ్చారు.

మజ్జిగౌరి అమ్మ దర్శనం..

ఎన్నికల ప్రచారానికి వచ్చిన భట్టీ మజ్జి గౌరమ్మ మందిరానికి వెళ్లి దర్శనం చేసుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలను చేయించి అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

రాహుల్ గాంధీ సభను విజయవంతం చేయండి..

ఎన్నికల ప్రచారానికి శుక్రవారం రాయగడకు వస్తున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పాల్గొనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని భట్టీ ప్రజలను కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన వస్తే చేపట్టనున్న పథకాలు, హామీలను రాహుల్ గాంధీ ప్రకటిస్తారన్నారు. ఏఐసీసీ సాధారణ కార్యదర్శి షాన్‌వాష్ చౌదరి, విశ్వరంజన్ మహంతి, రాయగడ ఎమ్మెల్యే అభ్యర్థి అప్పల స్వామి కద్రక, కొరాపుట్ ఎంపీ అభ్యర్థి సప్తగిరి ఉలక, పీసీసీ సాధారణ కార్యదర్శి దుర్గా ప్రసాద్ పండా తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు షాక్

- బీజేడీలో చేరిన ప్రఫుల్ల భొత్ర



పాండ్యన్ సమక్షంలో బీజేడీలో చేరిన ప్రఫుల్ల భొత్ర

జయపురం: జయపురం కాంగ్రెస్‌లో ప్రముఖ నేత ప్రఫుల్ల భొత్ర బుధవారం సాయంత్రం బీజేడీలో చేరారు. వి.కె.పాండ్యన్ యపురం పర్యటన సమయంలో ప్రఫుల్ల భొత్ర ఆయన సమక్షంలో బీజేడీలో చేరారు. భొత్ర మున్సిపాలటీ మాజీ కౌన్సిలర్. భొత్ర కొట్‌పాడ్ నియోజకవర్గంలో కాంగ్రెస్ టిక్కెటు కోసం ప్రయత్నించారు. అధిష్ఠానం అతడికి టిక్కెట్టు ఇవ్వకపోవంతో పార్టీని వీడి బీజేడీలో చేరినట్లు పలువురు అభిప్రాయ పడుతున్నారు. భొత్ర బీజేడీలో చేరిక వల్ల ఆ పార్టీకి క్రిష్టియన్ ఓట్లు పడే అవకాశం ఉందని అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. బీజేడీ జయపురం అభ్యర్థి డాక్టర్ ఇందిర నందో, పలువురు నాయకులు ఉన్నారు.

బీజేపీ 5వ జాబితా విడుదల

భువనేశ్వర్: రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు భారతీయ జనతా పార్టీ (బీజేపీ) గురువారం 5వ జాబితాలో మరో ఆరుగురు అభ్యర్థులను ప్రకటించింది. ఒడిశాలో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు ఈనెల 13, 20, 25, జూన్ 1 తేదీల్లో నాలుగు దశల్లో జరగనున్నాయి.

అభ్యర్థి	నియోజకవర్గం
అశిష్ పాత్రో	భొగరాయ్
డాక్టర్ పూర్ణచంద్ర మహాపాత్రో	కటక్-బరాబటి
డాక్టర్ శంభునాథ్ రౌత్	ఘసిపురా
సుదాంసు నాయక్	భండారిపొఖొరి
ఉమేష్ చంద్ర జెనా	బొరి
ప్రకాష్‌చంద్ర రణబిజులి	బెగుణియా

కాంగ్రెస్ బైక్ ర్యాలీ ప్రచారం ప్రారంభం



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు



మిశ్రణ పర్వ్‌లో కాంగ్రెస్‌లో చేరిన ఇతర పార్టీల కార్యకర్తలు

జయపురం: ఎన్నికలు సమీపిస్తుండడంతో అన్ని పార్టీలు ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. ఇందులో భాగంగా కాంగ్రెస్ పార్టీ కూడా ప్రచారాన్ని ముమ్మరం చేసింది. జయపురం శాసనసభ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి తారాప్రసాద్ బాహిణీపతి గురువారం నుంచి బైక్ ర్యాలీలు నిర్వహిస్తూ ప్రచారానికి శ్రీకారం చుట్టారు. జయపురం సమితి పంపుణి గ్రామ పంచాయతీ కుములిపుట్‌లో ర్యాలీని ప్రారంభించారు. బైక్ ర్యాలీ నియోజవర్గంలోని అన్ని గ్రామాల్లో కొనసాగుతోందని ఎమ్మెలన్య బాహిణీపతి వెల్లడించారు. ఒక పక్క ఇతర పార్టీలకు చెందిన వారిని కాంగ్రెస్‌లో చేర్చుకోవడానికి మిశ్రణ పర్వ్‌లు నిర్వహిస్తూనే మరోపక్క ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. ప్రజలను కలుసుకొని పదేళ్లలో తాను చేసిన అభివృద్ధి పనులను వివరిస్తూ ఓటును అభ్యర్థిస్తున్నారు. పార్టీ శ్రేణులు కూడా ప్రచారంలో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. కాగా గురువారం లక్ష్మీనగర్‌లోని తన నివాసంలోను, హనగుడ కల్యాణ మండపం, కొంగ గ్రామంలో మిశ్రణ పర్వ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన వారు పార్టీలో చేరగా వారికి కండువాలు వేసి ఆహ్వానించారు. కౌన్సిలర్ ప్రణయ కిశోర్ నాయక్ ఐదో నంబర్ వార్డు నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ సాధారణ కార్యదర్శిణి మీణాక్షి బాహిణిపతి పాల్గొన్నారు.

సీఎం నవీన్ పట్నాయక్‌తోనే రాష్ట్రాభివృద్ధి

- 5టీ కార్యదర్శి వి.కె.పాండ్యన్



ర్యాలీలో కార్యకర్తలతో కలిసి నడుస్తున్న మాజీ మంత్రి రబినారాయణ నందో

జయపురం: ప్రగతి, మహిళా సాధికారత బీజేడీ అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన పట్నాయక్ ప్రధాన ఆశయమని 5టీ కార్యదర్శి, పార్టీ సీనియర్ నాయకుడు వి.కె.పాండ్యన్ అన్నారు. రాష్ట్రాభివృద్ధి ఆయనితోనే సాధ్యమని చెప్పారు. జయపురంలోని దసరా పోడియం వద్ద బుధవారం సాయంత్రం నిర్వహించిన ఎన్నికల బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో బీజేడీ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే ప్రజల కోసం మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తామన్నారు. ముఖ్యంగా ప్రతి గ్రామంలో మంచినీరు, సాగునీరు వనరులను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా చేస్తామని చెప్పారు. రైతుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. 24 ఏళ్ల నవీన్ పట్నాయక్ పాలనలో పట్టణ, గ్రామీణ ప్రజల సమస్యలు పరిష్కరించటంతో పాటు విద్య, వైద్య రంగానికి ప్రాధాన్యం ఇచ్చారన్నారు. రహదారి సౌకర్యాలు ఎంతో మెరుగు పరిచారని వివరించారు. బిజూ బాబు ఆశయాలు నెరవేర్చేందుకు నవీన పట్నాయక్ కట్టుబడి ఉన్నారని పేర్కొన్నారు. జయపురం పట్టణంలో చారిత్రాత్మక జగన్నాథ్ సాగర్, నీలకంత సాగర్ తదితర చెరువులను ఆధునికీకరించి అందంగా తీర్చిదిద్దారన్నారు. మహిళా సాధికారతను బలోపేతం చేయటంతో పాటు ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువ చేసేందుకు చర్యలు చేపట్టారని పేర్కొన్నారు. క్రీడా ప్రగతికి జయపురంలో క్రీడా క్లబ్బు, సైన్స్ పార్క్ ఏర్పాటు చేశారన్నారు. రాష్ట్రం మరింత పురోగతి సాధించాలంటే బీజేడీ పార్టీ తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులను శంఖం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. నవీన్ పట్నాయక్ మాటల మనిషి కాదని చేతల మనిషని కితాబు ఇచ్చారు. కాగా తొలుత జయపురం చేరుకున్న పాండ్యన్‌కు బీజేడీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. భారీ ర్యాలీ మధ్య సభా వేదిక వరకూ తోడ్కొని తీసుకెళ్లారు. సభలో జయపురం బీజేడీ అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ ఇందిరా నందో, కొరాపుట్ ఎంపీ అభ్యర్థి అభికౌశల్య హికాక, మాజీ మంత్రి రబినారాయణ నందో పాల్గొన్నారు.



ర్యాలీలో బీజేడీ నేత వి.కె.పాండ్యన్



ర్యాలీలో ఆదివాసీ సంప్రదాయ నృత్యాలు



వేదికపై పాండ్యన్‌తో పాటు ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు



బహిరంగసభకు హాజరైన జనం

క్లుప్తంగా

బీజేపీలో పలువురి చేరిక



బీజేపీలో చేరుతున్న బీజేడీ కార్యకర్తలు

పర్లాకిమిడి: గజపతి జిల్లా కాశీనగర్ సమితి శియ్యాళి పంచాయతీ కర్నిభద్రలో బీజేపీ మిశ్రణ్ పర్వ్ సమావేశం జరిగింది. శియ్యాళి పంచాయతీకి చెందిన 50 మంది బీజేడీ కార్యకర్తలు బీజేపీలోకి చేరారు. వీరికి కమలం కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఛిత్రి సింహాద్రి, రొక్కం రాంప్రసాద్ (జ్యోతి), రొక్కం సతీష్, తదితరులు పాల్గొన్నారు.

బీజేడీలోకి బి.సీతాపురం గ్రామస్తుల చేరిక



బీజేడీలో చేరిన బి.సీతాపురం గ్రామస్తులు

పర్లాకిమిడి: జిల్లాలోని గుసాని సమితి కెరండీ పంచాయతీ బి.సీతాపురం గ్రామంలో పలువురు బీజేపీ పార్టీ కార్యకర్తలు బీజేడీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి మాజీ ఎమ్మెల్యే, ప్రచార అధ్యక్షుడు కెంగం సూర్యారావు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ మిశ్రణ్ పర్వ్ పర్లాకిమిడి రాంనగర్ హైటెక్ ప్లాజాలో నిర్వహించారు. బీజేడీ అభ్యర్థి రూపేష్ పాణిగ్రాహి తదితరులు ఉన్నారు.

భారీగా గంజాయి స్వాధీనం



పట్టుబడ్డ గంజాయితో పోలీసులు

కొరాపుట్: గంజాయి రవాణా గుట్టురట్టయింది. భారతమాల రోడ్డు సమీపంలో పోలీసులు గురువారం దాడులు చేసి అక్రమంగా రవాణా చేస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి వివరాలను కొరాపుట్ జిల్లా సునాబెడా పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌డీపీవో మనోబ్రత సత్పతి వివరించారు. సిమిలిగుడ పోలీస్‌స్టేషన్ పరిధిలో నిర్మితవుతున్న భారత మాల మార్గంలో బెహరా గుడ గ్రామం వద్ద జైలో వ్యాన్‌ని పోలీసులు గుర్తించారు. వ్యాన్‌కు తాళం వేసి ఉండడంతో అనుమానం వచ్చి మెజిస్ట్రేట్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన సమక్షంలో వ్యాన్ అద్దాలు పగలుగొట్టి చూశారు. అందులో 136 ప్యాకెట్లలో నాలుగు వందల కిలోల గంజాయిని గుర్తించారు. దీన్ని సీజ్ చేసి కోర్టుకి సమాచారం ఇచ్చారు. వాహన నంబర్ ఆధారంగా దాని యజమాని కోసం గాలిస్తున్నట్లు వివరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

టెక్కలి రూరల్: మండలంలోని బొప్పాయిపురం వద్ద జాతీయ రహదారిపై గురువారం ఉదయం గుర్తు తెలియని వాహనం ఢీకొని కోటబొమ్మాళి కి చెందిన రొక్కం సాయి అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. టెక్కలిలో వ్యక్తిగత పనుల నిమిత్తం ద్విచక్రవాహనంపై వచ్చి తిరిగి స్వగ్రామం వెళ్తుండగా వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. కాలువలోకి తుళ్లిపడిన యువకుడిని గుర్తించిన స్థానికులు హైవే అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అనంతరం టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యుడు వినోద్ క్షతగాత్రుడిని పరీక్షించి తలకు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. టెక్కలి ఎస్.లక్ష్మి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

టెక్కలి రూరల్: వలేసాగరం గ్రామ సమీప జాతీయ రహదారిపై గురువారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. ఉదయం 5 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు దాటుతుండగా పలాస నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. మృతుడి వయసు 70 ఏళ్లు ఉండవచ్చని, ఒక్క తువ్వాలు మాత్రమే ధరించి ఉన్నాడని, యాచకుడై ఉండవచ్చునని భావిస్తున్నారు. టెక్కలి ఎస్ఐ-2 వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

కంచిలి: మండలంలోని పెద్దకొజ్జిరియా గ్రామానికి చెందిన వివాహిత వరకట్నం వేధింపులు భరించలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. పెద్దకొజ్జిరియాకు చెందిన మార్పు సింధు(20)కు అదే గ్రామానికి చెందిన జగదీష్‌తో వివాహమైంది. వీరికి 14 నెలలు బాబు ఉన్నారు. కొన్నాళ్లుగా సింధును భర్త జగదీష్, మామయ్య రాఘవులు, అత్త చిరంజీవులు వరకట్నం కోసం వేధిస్తుండటంతో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో బుధవారం రాత్రి ఇంట్లో గొడవ జరగడంతో అందరూ చూస్తుండగానే సింధు గదిలోకి వెళ్లి సీలింగ్ ఫ్యాన్‌కు చీరకట్టి ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే కుటుంబ సభ్యులు, గ్రామస్తులు సింధును రక్షించి ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో శ్రీకాకుళం జెమ్స్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

జోరుగా.. నామినేషన్లు

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి మరో విడత పోలింగ్‌కు గురువారం రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున నామినేషన్లు దాఖలయ్యాయి. అభ్యర్థులు తమ మద్దతుదారులతో ర్యాలీగా వెళ్లి నామినేషన్ పత్రాలను అధికారులకు సమర్పించారు. వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థులు ప్రత్యేక పూజలు నిర్వహించి నామినేషన్లు వేసేందుకు బయల్దేరారు. వారితో పాటు ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు.

– భువనేశ్వర్



సంబలపూర్ పార్లమెంటరీ నియోజకవర్గానికి బీజేపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న ధర్మేంద్ర ప్రధాన్



భువనేశ్వర్ పార్లమెంటరీ నియోజకవర్గానికి బీజేపీ అభ్యర్థిగా నామినేషను దాఖలు చేస్తున్న అపరాజిత షడంగి



కందమాల్ పార్లమెంటరీ నియోజకవర్గానికి బీజేడీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న డాక్టర్ అచ్యుత్ సామంత్



భువనేశ్వర్ సెంట్రల్ అసెంబ్లీ స్థానానికి బీజేపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న జగన్నాథ్ ప్రధాన్



దసపల్లా అసెంబ్లీ స్థానానికి బీజేపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న రాఘవ్ మల్లిక్



పూరీ పార్లమెంటరీ నియోజకవర్గానికి బీజేడీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న అరూప్ పట్నాయక్

పాదచారుల దాహార్తి తీర్చిన శిశువిద్యా మందిర్ సిబ్బంది



రఘునాథ్ మందిర కూడలి వద్ద పెరుగు పాణ శిబిరం

జయపురం: జయపురం పట్టణంలో ఎండలు మండుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణానికి పనుల కోసం వచ్చే దాహం తీర్చేందుకు స్థానిక సరస్వతీ శిశు విద్యా మందిరం, శారదా విహార్ సిబ్బంది కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా పెరుగు పాణను పంచి వారి దాహార్తి తీర్చారు. పట్టణంలోని రఘునాథ్ మందిరం కూడలి, వెల్‌కం జంక్షన్ సమీప రామకృష్ణ హోటల్ వద్ద పెరుగు పాణను ప్రజలకు పంచారు. మండుటెండలో రోడ్డుపై వెళ్తున్న వారి వద్దకు వెళ్లి చల్లని పానీయం పెరుగు పాషణ అందజేశారు. ఉపాధ్యాయులు, సేవా సభ్యులు గురువారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో శిశు విద్యామందిర ప్రధాన ఆచార్యులు సత్యనారాయణ శెట్టి, విద్యామందిర



పాదచారులకు పెరుగును అందజేస్తున్న దృశ్యం

యాజమాన్య కమిటీ కార్యదర్శి పంకజ కుమార్ పాత్రో, కోఆర్డినేటర్ సుకాంత కుమార్ బెహర, విద్యాలయ సమితి ఉపాధ్యక్షులు డాక్టర్ మనోరంజన్ ప్రధాన్, మాజీ కార్యదర్శి నిరాకర చౌధురి పాల్గొన్నారు.

పోలింగ్ శాతం పెంచేందుకు చర్యలు



సార్వత్రిక ఎన్నికల కోసం సంతాకాలు సేకరిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: బరంపురం పార్లమెంటరీ స్థానంలో పర్లాకిమిడి, మోహనా అసెంబ్లీ నియోజకవర్గాల్లో 2024 సార్వత్రిక ఎన్నికల్లో ప్రతీ ఓటరు తన ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ అన్నారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఆవరణలో సంతకాల సేకరణ, ఆడియో వితరణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో జిల్లాలో గత ఎన్నికల కంటే (71 శాతం) ఎక్కువ శాతం పోలింగ్ పెరగటానికి సంతకాల సేకరణ, ఆడియో, వీడియో క్యాసెట్లు వినియోగిస్తున్నామని కేంద్ర ఎన్నికల కమిషనర్ నియమించిన జిల్లా ఎన్నికల ముఖ్య అబ్జర్వర్ గంధం నాయుడు అన్నారు. ఈ సందర్భంగా ఓటరుకు చైతన్యం కలిగించడానికి ఆడియో, వీడియో సీడీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో



ఆడియో, వీడియో సీడీని ఆవిష్కరిస్తున్న ఎన్నికల ప్రత్యేక అబ్జర్వర్ గంధం నాయుడు

ఎన్నికల ఇన్‌చార్జి గుణనిధినాయక్, ప్రాణకృష్ణ పాణిగ్రాహి, జిల్లా సాంస్కృతిక శాఖ అధికారి అర్చనా మంగరాజ్, డీసీపీఓ అరుణ్ కుమార్ త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.

ఖనిజ సంపదను దోచుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం



సభలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి శంతాను ఠాకూర్



సభకు హాజరైన ప్రజలు

- కేంద్ర షిప్పింగ్ శాఖ మంత్రి శంతను ఠాకూర్ ఆరోపణ

మల్కన్‌గిరి: గిరిజన ప్రాంతాల్లో ఉన్న ఖనిజ సంపదను రాష్ట్ర ప్రభుత్వం దోచుకుంటుందని కేంద్ర షిప్పింగ్, జలమార్గాల మంత్రి శంతాను ఠాకూర్ ఆరోపించారు. బీజేపీ అభ్యర్థుల తరఫున ఎన్నికల ప్రచారం చేసేందుకు గురువారం ప్రత్యేక హెలికాప్టర్‌లో మల్కన్‌గిరి వచ్చారు. మల్కన్‌గిరి సమితి ఎంపీవీ 10 ఓల్డ్ రైస్‌మిల్ మైదానంలో దిగి అక్కడ నుంచి ఎంవీ-30 గ్రామం వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం గిరిజనుల కోసం చేస్తున్న అభివృద్ధిని వివరించారు. గిరిజనుల సంక్షేమానికి కృషి చేస్తున్నామని చెబుతున్న రాష్ట్రంలోని బీజేడీ సర్కార్ వారి అటవీ, ఖనిజ సంపదను పూర్తిగా దోచుకుంటుందని విమర్శించారు. గత ఎన్నికల్లో మల్కన్‌గిరి ప్రజలు బీజేపీ అభ్యర్థులకు అండగా నిలబడ్డారని.. త్వరలో జరగనున్న ఎన్నికల్లో కూడా బీజేపీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. బీజేపీ ప్రభుత్వం వస్తే ఇక్కడ ప్రజల కష్టాలు తీరుతాయన్నారు. మల్కన్‌గిరి, చిత్రకొండ అభ్యర్థులన అధిక మెజార్టీతో గెలిపించాలని కేంద్రం కేంద్ర మంత్రి శంతాను ఠాకూర్ కోరారు. ఆయనకు ముందుగా ఎంపీవీ-10 వద్ద జిల్లా బీజేపీ అధ్యక్షుడు నిమాయి పాల్ స్వాగతం పలికారు. సభలో మల్కన్‌గిరి ఎమ్మెల్యే అభ్యర్థి నర్సింగ్ మాడ్కమి పాల్గొన్నారు.

ఆప్ మరో జాబితా విడుదల

భువనేశ్వర్: ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఒడిశాలో మరో 11 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. దీంతో రాబోయే ఎన్నికలకు ఆప్ ఇప్పటివరకు 48 స్థానాల్లో ఎమ్మెల్యే అభ్యర్థులను ఖరారు చేసినట్లు పేర్కొంది.

నియోజకవర్గం	అభ్యర్థి
బరాబటి కటక్	అశోక్ కుమార్ షడంగి
భువనేశ్వర్(సెంట్రల్)	డా.అరుణ్ కుమార్ నాయక్
భువనేశ్వర్(ఏకామ్ర)	బిశ్వజిత్ మిశ్రా
జయదేవ్	దీనబంధు నాయక్
హింజిలి	భజరన్ సాబత్
కొంటామల్	అంతర్యామి బెహెరా
కొరై	త్రినయన్ రథ్
రాణాపూర్	సుధీర్ దాస్
భండారిపాఖోరి	దేబాశిష్ పాణిగ్రాహి
జాజ్‌పూర్	సుబోధ కుమార్ దాస్
చిలికా	సంగ్రామ కేశరి పరిదా

డీపీఆర్ఓ కార్యాలయం సందర్శన



లలాటేందు మహాపాత్రోకు స్వాగతం పలుకుతున్న దృశ్యం

పర్లాకిమిడి: రాష్ట్ర సమాచార, పౌరసంబధాల శాఖ ఉపసంచాలకులు లలాటేందు మహాపాత్రో గజపతి జిల్లాలో గురువారం పర్యటించారు. పర్లాకిమిడి రాజా ప్యాలస్‌లోని డీపీఆర్ఓ కార్యాలయాన్ని సందర్శించారు. ఆయనను డీపీఆర్ఓ ప్రదీప్త గురుమయి, సిబ్బంది స్వాగతం పలికారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి, జిల్లా స్థాయి విలేకరుల ప్రెస్ కటింగ్‌లు చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉద్యోగులు నరసింగ బలబంధు, ప్రదీప్ కుమార్ రోథో పాల్గొన్నారు.

ఉక్కబోతతో ఉక్కిరిబిక్కిరి



నిర్మానుష్యంగా సబ్ జైల్ రోడ్డు

పర్లాకిమిడి: మండుతున్న ఎండలతో జనం అల్లాడిపోతున్నారు. గజపతి జిల్లా కేంద్రం పర్లాకిమిడిలో గురువారం ఉదయం 11 గంటల సమయంలో 39.33 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యింది. వేడిని తట్టుకోలేక ప్రజలు అల్లాడి పోయారు. ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు ఎవరూ సాహసం చేయలేదు. దీంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. కాగా ఎండనుంచి ఉపశమం కోసం చాలామంది కూలర్లు, ఏసీలు కొనుగోలు చేస్తున్నారు. అలాగే శీతల పానీయలకు డిమాండ్ పెరిగింది. ఎండలు ఇలాగే కొసాగితే సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌పై



ఎండ ఎక్కువ ఉందని చెబుతున్న జాజిపురం రైతు సిమాంజల జెన్నా

ప్రభావం చూపే అవకాశం ఉందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

ఎక్సైజ్ సిబ్బంది దాడులు

- 40 లీటర్ల సారా స్వాధీనం



స్వాధీనం చేసుకున్న సారా

రాయగడ: జిల్లాలోని కాశీపూర్ సమితి పటముండ గ్రామంలో ఎక్సైజ్ సిబ్బంది గురువారం దాడులను నిర్వహించారు. ఈ సందర్భంగా సారా తయారీకి ఉపయోగించేందుకు సిద్ధం చేసిన 1200 లీటర్ల ఊటను ధ్వంసం చేశారు. 40 లీటర్ల సారాను స్వాధీనం చేశారు. కొండ ప్రాంతంలో ఉన్న ఈ గ్రామంలో సారా తయారు చేసి వేరే ప్రాంతాలకు రవాణా



ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

చేస్తున్నట్టు అందిన సమాచారం మేరకు దాడులు చేసినట్టు పోలీసులు పేర్కొన్నారు.

దోశ తినిపించి.. గొంతు నులిమి..

- వృద్ధురాలి దారుణంగా హత్య చేసిన మహిళ

వజ్రపుకొత్తూరు: మండలంలోని అమలపాడులో గత నెల 28న కాలువలో శవమై తేలిన దున్న దమయంతి(62) మృతిని పోలీసులు వారం రోజుల్లోనే ఛేదించారు. గ్రామానికి చెందిన యానాది జ్యోతి బంగారం కోసమే హత్య చేసి యానాది నారాయణ అనే వ్యక్తి సహకారంతో కాలువలో పడేసినట్లు దర్యాప్తులో తేలింది. కాశీబుగ్గ రూరల్ సీఐ పి.ఈశ్వరరావు, ఎస్ఐ సీహెచ్.రామారావు గురువారం వజ్రపుకొత్తూరు పోలీసుస్టేషన్‌లో విలేకరులకు వివరాలు వెల్లడించారు.

విలాసాలకు అలవాటుపడి..

అమలపాడుకు చెందిన యానాది జ్యోతి గ్రామంలో వడ్డీ వ్యాపారం చేస్తోంది. భర్త వెల్డర్‌గా పని చేస్తున్నాడు. విలాసాలకు అలవాటు పడిన జ్యోతి తన అల్లుడిని మధ్యవర్తిగా ఉంచి నందిగాం మండలం హర్షబాడకు చెందిన ఓ వ్యక్తి నుంచి రూ.1.50 లక్షలు అప్పుగా తీసుకుంది. అప్పు తీర్చమని ఒత్తిడి పెరగడంతో ఏం చేయాలో తెలియని సమయంలో అదే గ్రామానికి చెందిన దున్న దమయంతి వద్ద ఉన్న బంగారు ఆభరణాలపై కన్ను పడింది. దమయంతిని మచ్చిక చేసుకుని ఇంటికి పిలిచి ప్రతిరోజూ పండ్లు, స్నాక్స్ అందిస్తూ మరింత స్నేహం పెంచుకుంది. గత నెల 24న ఇదే మాదిరిగా పిలిచి దోశలు చేసింది. దమయంతి దోశ తింటున్న క్రమంలో జ్యోతి వెనుక నుంచి దుప్పటి కప్పి రెండు చేతులతో గొంతు నులమడంతో అక్కడికక్కడే మృతి చెందింది. వెంటనే మృతురాలి ఒంటిపై ఉన్న నాలుగు బంగారు గాజులు,



హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న కాశీబుగ్గ రూరల్ సీఐ ఈశ్వరావు, ఎస్ఐ రామారావు

రెండు పేకల పుస్తెలతాడు, చెవి దిద్దులు, మూడు ఉంగరాలు, జత ఎత్తు గొలుసులు, చైన్ తీసుకుని మృతదేహాన్ని ఇంటిలో మంచం కింద ఉంచి దుప్పటి కప్పేసింది. అదేరోజు రాత్రి జ్యోతి మేనమామ యానాది నారాయణను రప్పించి జరిగిన విషయం చెప్పింది. బంగారంలో వాటాతో పాటు తనతో వివాహేతర సంబంధానికి అంగీకరిస్తే మృతదేహం మాయం చేసేందుకు సహకరిస్తానని డిమాండ్ చేయగా జ్యోతి ఒప్పుకుంది. అదే రోజు రాత్రి 12 గంటల సమయంలో దుప్పటిలో చుట్టిన దమయంతి మృతదేహాన్ని ఇంటి సమీపంలో ఉన్న కాలువలో కుక్కి పలకలు కప్పేశారు.

దుర్వాసన రావడంతో..

ఇదిలా ఉండగా దమయంతి కనిపించకపోవడంతో కుమారుడు కృష్ణారావు రెండు రోజుల పాటు వెతికారు. ఘటన జరిగిన రెండు రోజుల తర్వాత ఏప్రిల్ 26న షిరిడిసాయి బాబా ఆలయానికి ఎదురుగా ఉన్న కాలువ సమీపంలోకి తాపీమేస్త్రీ వెళ్లగా దుర్వాసన



స్వాధీనం చేసుకున్న బంగారం

రావడంతో గ్రామస్తులకు తెలిపాడు. అనుమానం వచ్చి పలకలు తొలగించగా దమయంతి మృతదేహం కనిపించింది. వజ్రపుకొత్తూరు ఎస్ఐ రామారావు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం ప్రాథమిక నివేదికలో మృతురాలి మెడ ఎముక విరిగినట్లు వైద్యులు గుర్తించారు. వెంటనే అమలపాడు చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టగా జ్యోతి, నారాయణలపై అనుమానాలు వ్యక్తం చేశారు. ఐతే జ్యోతి ఆ సమయంలో గ్రామంలో ఉండకుండా శ్రీకాకుళం, కాశీబుగ్గలోని బంగారం దుకాణాల్లో నగలు అమ్మేందుకు ప్రయత్నాలు చేసింది. బంగారం కరిగించి పుస్తెలు సైతం చేయించుకుని ఏమీ ఎరగనట్లు గ్రామానికి వచ్చేసింది. పోలీసుల విచారణ ముమ్మరం చేయడంతో చివరకు తాము హత్యా నేరం నుంచి తప్పించుకోలేమని భావించి ఈ నెల 1న వీఆర్‌ఓ కూర్మారావు, పంచాయతీ కార్యదర్శి వద్ద నేరం చేసినట్లు అంగీకరించి పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయినట్లు సీఐ ఈశ్వరరావు తెలిపారు. తహసీల్దార్ సురేష్, ఎంపీడీఓ డి.తిరుమలరావుకు సమాచారం అందించి ఘటనా స్థలంలో సీన్ రీ క్రియేషన్ చేశారు. అనంతరం జ్యోతి, నారాయణలను అరెస్టు చేసి పలాస మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టులో గురువారం హాజరుపరచగా 14 రోజుల పాటు రిమాండ్ విధించారు.

క్లుప్తంగా

రైలు కింద పడి యువకుడి మృతి



రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని యువకుడి మృతదేహం

బొండపల్లి: మండలంలోని గరుడుబిల్లి – గొట్లాం గ్రామాల మధ్య రైల్వే ట్రాక్‌పై గురువారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి రైలు ఢీకొని మృతి చెందాడు. సంఘటనకు సంబంధించి విజయనగరం రైల్వే పోలీస్‌స్టేషన్ హెచ్.సి బి.కృష్ణారావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రైల్వే ట్రాకు దాటుతుండగాగానీ, రైలు ప్రయాణం చేస్తూ ప్రమాదవశాత్తు జారిపడిగానీ గుర్తు తెలియని 30 సంవత్సరాల వయస్సు గల యువకుడు పట్టాల మధ్య మృతి చెంది ఉండటాన్ని స్థానికులు గుర్తించి తమకు సమాచారం అందించగా ప్రమాద స్థలాన్ని పరిశీలించినట్లు తెలి పారు. మృతుని వద్ద ఎటువంటి ఆధారాలు లేవని, మృతుని శరీరంపై నలుపు, ఎరుపు రంగు చారలు అడ్డుగీతలు షర్టుతో పాటు, సిమెంటు రంగు ఫ్యాంట్ ధరించి ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. మృతదేహాన్ని విజయనగరంలోని కేంద్ర సర్వజన ఆస్పత్రికి తరలించామని ఆచూకీ తెలిసిన వారు విజయనగరం రైల్వే ఎస్‌ఐ పి.రవివర్మ 94906 17089, హెచ్‌సీ కృష్ణారావు 94410 13330 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

పుష్కరాలకు వెళ్లి పురోహితుడు మృతి



విశ్వేశ్వర శర్మ (ఫైల్)

సీతంపేట: నర్మద నది పుష్కరాలకు వెళ్లి స్థానిక లక్ష్మీగణపతి ఆలయ అర్చకులు వేమకోటి విశ్వేశ్వరశర్మ (66) గుండెపోటుతో గురువారం అక్కడ మృతి చెందారు. ఇటీవల మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో నర్మద పుష్కరాలకు కుటుంబ సభ్యులతో ఆయన వెళ్లారు. నదీస్నాన అనంతరం తిరుగు ప్రయాణమౌతుండగా ఆకస్మికంగా గుండె పోటు రావడంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విశ్వేశ్వర శర్మ ఆకస్మిక మృతితో గ్రామంలో విషాదం నెలకొంది. శుక్రవారం అంత్యక్రియలు స్వగ్రామమైన సీతంపేటలో జరగనున్నాయి. ఆయన మృతి తీరని లోటని గ్రామస్తులు సంతాపం తెలిపారు.

మద్యం తరలిస్తున్న ముగ్గురి అరెస్టు



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లను చూపుతున్న సీఐ శ్రీధర్

రాజాం సిటీ: మండలంలోని వివిధ గ్రామాలకు మద్యం అక్రమంగా తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశామని ఎస్‌ఈబీ సీఐ బి.శ్రీధర్ గురువారం తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో వీఆర్‌అగ్రహారం కూడలి వద్ద 30 మద్యం బాటిళ్లతో ఒక వ్యక్తిని, కంచరాం గ్రామ కూడలిలో 51 మద్యం బాటిళ్లతో మరో వ్యక్తిని, పట్టణ పరిధి వస్త్రపురి కాలనీ వద్ద 53 బాటిళ్లతో మరో వ్యక్తిని అరెస్టు చేశామని తెలిపారు. దాడుల్లో ఎస్‌ఐలు చంద్రశేఖర్, శ్రీనివాసరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కరపత్రాల్లేకుండా ఏం అవగాహన..?

- వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేసిన కమిషనర్ డాక్టర్ వెంకటేష్



జూమ్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు, ఇతర అధికారులు

విజయనగరం ఫోర్ట్: వడదెబ్బపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రూపొందించిన కరపత్రాలను తీసుకెళ్లని ముగ్గురు పీహెచ్‌సీ వైద్యాధికారులపై వైద్యారోగ్యశాఖ కమిషనర్ డాక్టర్ వెంకటేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం సాయంత్రం వైద్యారోగ్య శాఖ అధికారులతో ఆయన జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. వడదెబ్బ కరపత్రాలు తీసుకెళ్లకుండా ఏవిధంగా ప్రజలకు అవగాహన కల్పిస్తారని ప్రశ్నించారు. ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు తీసుకెళ్లి ఓఆర్‌ఎస్ కార్నర్ వద్ద సిద్ధంగా ఉంచాలని తెలిపారు. హీట్ వేవ్ నివేదికను ఐహెచ్‌పీ పోర్టల్‌లో ప్రతిరోజూ అప్‌లోడ్ చేయాలని తెలిపారు. వడదెబ్బకు గురియ్యే వారిని గుర్తించి ఐహెచ్‌ఈపీ పోర్టల్‌లో వివరాలు పొందుపరచాలని సూచించారు. ప్రతి పీహెచ్‌సీ వద్ద అగ్నిమాపక పరికరాలు ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వైద్యాధికారులు వారానికి ఒకసారి సిబ్బందితో సమీక్ష నిర్వహించాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ ఎస్.భాస్కరరావు, డీఐఓ అచ్యుతకుమారి, డీఎల్‌ఓ కె. రాణి, డీఎంఓ మణి, తదితరులు పాల్గొన్నారు.

వైద్య రంగంలో... ఉద్యోగ విప్లవం



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి లేబొరేటరీ వద్ద వైద్య పరీక్షల కోసం వచ్చిన రోగుల వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

- వేల మందికి ఉద్యోగాలిచ్చిన జగనన్న ప్రభుత్వం
- ఐదేళ్ల కాలంలో 2400 మందికి ఉద్యోగాలు
- అన్ని కేడర్ పోస్టులు భర్తీ చేసిన ప్రభుత్వం
- రోగులకు మెరుగైన వైద్య సేవలు

విజయనగరం ఫోర్ట్: రాష్ట్రంలోని వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులను జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీసుకొచ్చింది. వైద్య రంగ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అధిక సంఖ్యలో ఉద్యోగాలను భర్తీ చేసింది. ఆస్పత్రుల్లో ఖాళీలను భర్తీ చేయడంతో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. నాడు – నేడు ద్వారా ప్రభుత్వ ఆస్పత్రులను కార్పొరేట్ కంటే దీటుగా తీర్చిదిద్దింది. ఆస్పత్రుల్లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించింది. దీంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స పొందడానికి రోగులు అధిక సంఖ్యలో వస్తున్నారు. ఆధునాతన 108 అంబులెన్సులు ద్వారా సకాలంలో రోగులను ఆస్పత్రికి చేర్చి ఎంతో మందికి పునర్జన్మ ప్రసాదిస్తున్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా రోగుల ఇళ్ల వద్దకే వైద్య సేవలు అందిస్తున్నారు. ఆస్పత్రిలో ప్రసవానంతరం తల్లీబిడ్డ ఇద్దరిని తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలద్వారా సురక్షితంగా ఇంటికి చేర్చుతున్నారు.

వేలాది మంది నియామకం

వైద్య శాఖలో జిల్లాలో వేలాది మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించి వారి జీవితాల్లో సీఎం జగన్ మోహన్ రెడ్డి వెలుగులు నింపారు. 2019 నుంచి ఇప్పటి వరకు 2400 మందికి ఉద్యోగాలు కల్పించారు. దీనిని బట్టి ఎంత పెద్ద ఎత్తున నియామకాలు చేపట్టారో అర్థమవుతుంది. వార్డు బాయ్ దగ్గర నుంచి స్పెషలిస్టు డాక్టర్ వరకు అన్ని కేడర్ల పోస్టులను భర్తీ చేశారు.

పారదర్శకంగా పోస్టులు భర్తీ

వైద్య శాఖలో పారదర్శకంగా పోస్టులను భర్తీ చేసింది. రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం ఎంఎన్‌ఓ దగ్గర నుంచి డాక్టర్ వరకు నిబంధనల ప్రకారం మెరిట్ ఆధారంగా పోస్టులను భర్తీ చేశారు. వేలాది పోస్టులు భర్తీ చేసినప్పటికీ ఎక్కడ అవకతవకలకు లేకుండా చర్యలు తీసుకున్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు

వైఎస్సార్ విలేజ్ క్లినిక్, పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రి, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రుల్లో వైద్య సిబ్బందిని పూర్తి స్థాయిలో నియమించడంతో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. అంతేకాకుండా సకాలంలో వైద్య సేవలు అందుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ల్లో ప్రభుత్వం సీహెచ్‌ఓ (కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్)ను నియమించింది. వీరు గ్రామ స్థాయిలో అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందిస్తున్నారు. పీహెచ్‌సీల్లో ఇద్దరు వైద్యులను ప్రభుత్వం నియమించింది. వీరిలో ఒకరు పీహెచ్‌సీలో వైద్య సేవలు అందించగా మరొకరు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో పాల్గొని గ్రామాలకు వెళ్లి వైద్యసేవలు అందిస్తున్నారు.

2019 నుంచి ఇప్పటి వరకు జిల్లాలో భర్తీ చేసిన పోస్టుల వివరాలు

కేడర్	పోస్టుల సంఖ్య
స్పెషలిస్టు డాక్టర్	23
మెడికల్ ఆఫీసర్	49
ఏఎన్‌ఎం	591
స్టాఫ్‌నర్సులు	278
ల్యాబ్ టెక్నీషియన్స్	80
ఫార్మసిస్టు	72
ఇతర పోస్టులు	147
క్లాస్ ఫోర్	279
డేటాఎంట్రీ ఆపరేటర్స్	33
ఎంఎల్‌హెచ్‌పీలు	604
థియేటర్ అసిస్టెంట్స్	35
కౌన్సిలర్లు	04
బయోమెడికల్ ఇంజనీర్స్	5
108, 104 సిబ్బంది	200

జీరో వేకెన్సీ పాలసీతో ఖాళీలు లేకుండా భర్తీ

గతంలో వైద్య శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులు ఏళ్ల తరబడి భర్తీ చేసేవారు కాదు. రెండు, మూడు పీహెచ్‌సీలకు ఒక వైద్యుడు, ఒక ల్యాబ్ టెక్నీషియన్ సేవలు అందించేవారు. కానీ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతి పీహెచ్‌సీకి ఇద్దరు వైద్యులను, ముగ్గురు స్టాఫ్ నర్సులను నియమించారు. ప్రతి పీహెచ్‌సీకి ఒక ల్యాబ్ టెక్నీషియన్‌ను నియమించారు. జీరో వేకెన్సీ పాలసీ తీసుకొచ్చి పోస్టుల కొరత లేకుండా పోస్టులను భర్తీ చేస్తున్నారు. వైద్య ఆరోగ్య శాఖ, వైద్య విధాన్ పరిషత్, ప్రభుత్వ వైద్య కళాశాలల్లో వేలాది పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసింది.



నడుం నొప్పితో వచ్చిన వ్యక్తికి చికిత్స చేస్తున్న ఫిజియోథెరపిస్టులు

పోస్టల్ బ్యాలెట్ల పరిశీలన



పోస్టల్ బ్యాలెట్ల ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: పోస్టల్ బ్యాలెట్ల పరిశీలన కలెక్టరేట్ ఆడిటోరియంలో గురువారం జరిగింది. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి ఈ కార్యక్రమాన్ని పరిశీలించారు. బ్యాలెట్ పేపర్లను, కవర్లను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమాన్ని వేగంగా పూర్తి చేసి, ఆయా ప్రాంతాలకు పోస్టల్ బ్యాలెట్లను త్వరగా పంపించాలని ఆదేశించారు. పోస్టల్ బ్యాలెట్లు నోడల్ ఆఫీసర్ సందీప్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ ఎ.కళ్యాణ చక్రవర్తి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సుధారాణి, ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

రెండు పూరిళ్లు దగ్ధం



అగ్ని ప్రమాదంలో కాలిపోయిన పూరిళ్లు

గుర్ల: మండలంలోని చోడవరంలో గురువారం జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు పూరిళ్లు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో లావేటి అప్పారావు, లావేటి ఎరకయ్యకు చెందిన పూరిల్లు పూర్తిగా కాలిపోయాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదం జరిగి ఉంటుందని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో ఇంట్లో ఎవ్వరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. సుమారుగా రెండు లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని రెవెన్యూ అధికారులు అంచనా వేశారు. అగ్ని మాపక సిబ్బంది మంటలు ఆదుపు చేశారు.

గంజాయితో ముగ్గురి అరెస్టు



స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపిస్తూ వివరాలు వెల్లడిస్తున్న సీఐ వెంకటరావు (వెనుక ముసుగులో నిందితులు)

విజయనగరం క్రైమ్: స్థానిక తోటపాలెం బ్యాంక్ కాలనీ సమీపంలో డిల్లీ నోయిడా ప్రాంతానికి చెందిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి 18 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు పంపినట్లుగా వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు తెలిపారు. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం నోయిడా ప్రాంతానికి చెందిన షేర్, గౌరవ్ రజోనియా అనే ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తుల నుంచి 18 కిలోల గంజాయితో రైల్వేస్టేషన్ వైపు వెళ్తుండగా వన్‌టౌన్ పోలీసులకు రాబడిన సమాచారంతో వారిని అదుపులోకి తీసుకుని, అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. గంజాయి అక్రమ రవాణాకు పాల్పడిన వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నామని, ఏదైనా సమాచారం ఉంటే వన్‌టౌన్ పోలీసులకు తెలియజేయాలని సీఐ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

15.6 కిలోల గంజాయి పట్టివేత

విజయనగరం రైల్వేస్టేషన్ పరిధిలో అరకు నుంచి విశాఖపట్టణం కిరండోల్ ఎక్స్‌ప్రెస్‌లో గురువారం నిర్వహించిన తనిఖీల్లో 15.6 కిలోల గంజాయిని రైల్వే లైన్స్ ఇన్‌స్పెక్టర్ కె.వెంకటరావు నేతృత్వంలో విజయనగరం జీఆర్‌పీ ఎస్‌ఐ రవివర్మ, సిబ్బంది పట్టుకుని, సీజ్ చేశారు. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అశోక్ అనే వ్యక్తి రైల్‌లో గంజాయి రవాణా చేస్తున్నట్లు తనిఖీల్లో గుర్తించారు. అతని నుంచి రూ.78వేలు విలువ గల 15.6 కిలోల గంజాయిని సీజ్ చేసి, నిందితున్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. విజయనగరం, పార్వతీపురం, బొబ్బిలి, కొత్తవలస, అరకు రైల్వేస్టేషన్‌ల పరిధిలో తనిఖీలు విస్తృతం చేస్తున్నామని జీఆర్‌పీ లైన్స్ ఇన్‌స్పెక్టర్ వెంకటరావు తెలిపారు.

గంజాయి కేసులో ముద్దాయిలకు జైలు

విజయనగరం క్రైమ్: స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో 2020లో నమోదైన గంజాయి కేసులో ముద్దాయి చందక రమణకు మూడేళ్ల జైలు, రూ.30వేలు జరిమానా విధిస్తూ ఫస్ట్ క్లాస్ అదనపు జిల్లా జడ్జి జి.రజని తీర్పు వెల్లడించినట్లు టూటౌన్ సీఐ కె.రామారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక బాబామెట్ట డబుల్ కాలనీలో గల రేకుల షెడ్ వద్ద 2020లో ఒక వ్యక్తి అక్రమంగా గంజాయి కలిగిన చిన్న చిన్న ప్యాకెట్ల రూపంలో అమ్ముతున్నట్లు టూటౌన్ పోలీసులకు వచ్చిన సమాచారంతో పోలీసులు బాబామెట్ట వద్దకు చేరుకుని నిందితుడు చందక రమణను అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి కేజీన్నర గంజాయిని స్వాధీనం చేసుకుని, నిందితులపై అప్పటి టూటౌన్ ఎస్‌ఐ వి.బాలాజీరావు కేసు నమోదు చేశారు. సీఐ సిహెచ్.శ్రీనివాసరావు దర్యాప్తు చేపట్టి నిందితులను అరెస్టు చేసి, కోర్టులో అభియోగపత్రాలను దాఖలు చేశారన్నారు. కోర్టు ప్రాసిక్యూషన్‌లో నిందితుడుపై నేరారోపణలు రుజువు కావడంతో విజయనగరం ఫస్ట్ క్లాస్ అదనపు జిల్లా జడ్జి జి.రజని మూడేళ్ల జైలు శిక్ష, రూ. 30వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించినట్లుగా సీఐ కె తెలిపారు. కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా బెల్లాన రవి, పోలీసుల తరపున వాదనలు వినిపించగా, టూటౌన్ కోర్టు మహిళా కానిస్టేబుల్ రాధిక సాక్ష్యులను కోర్టులో హాజరు పర్చారన్నారు.

సాలూరులో ఫ్లాగ్‌మార్చ్

సాలూరు: సీఐ వాసునాయుడు ఆధ్వర్యంలో సాలూరు పట్టణంలో గురువారం పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ మేరకు పట్టణంలోని డబ్బివీధి, కోటవీధి, పెదహరిజనపేట, వెంకటేశ్వర కాలనీల్లో ప్రత్యేక పోలీస్‌బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికల వేళ అందరూ ఎన్నికల నియమావళికి అనుగుణంగా నడుచుకోవాలని పిలుపునిచ్చారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సైలు, ప్రత్యేక పోలీస్ బృందాలు పాల్గొన్నాయి.



ఫ్లాగ్‌మార్చ్ చేస్తున్న పోలీస్ సిబ్బంది

పైడితల్లి హుండీల ఆదాయం లెక్కింపు

విజయనగరం టౌన్: పైడితల్లి అమ్మవారి ఆలయ హుండీల ఆదాయాన్ని అమ్మవారి కల్యాణ మండపం ఆవరణలో గురువారం లెక్కించారు. 34 రోజులకు చదురుగుడి హుండీల నుంచి రూ.13,14,277లు వచ్చినట్లు ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు తెలిపారు. కార్యక్రమంలో శ్రీవారి సేవా సంఘం ప్రతినిధులు, ధర్మవరం గ్రూప్ టెంపుల్స్ ఈఓ బి.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

రోడ్డు ప్రమాదంలో బీజేపీ నేత దుర్మరణం

గుర్ల: మండలంలోని కలవచర్ల వద్ద బుధవారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బీజేపీ మాజీ మండల పార్టీ అధ్యక్షుడు అల్లూరి రామకృష్ణ రాజు (56) తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వ్యక్తిని 108 ద్వారా విజయనగరంలోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. చికిత్స పొందుతున్న ఆయన గురువారం మృతి చెందారు. ఎస్‌ఐ భాస్కరరావు కేసు నయోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కలవచర్ల వద్దనున్న మలుపు వద్ద ద్విచక్ర వాహనంపై వెళ్తున్న అల్లూరి రామకృష్ణ రాజు, కోటగంద్రేడు నుంచి వస్తున్న మరో ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి రోడ్డు ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. ఆయన మృతి వైఎస్సార్‌సీపీ నాయకులు, బీజేపీ నేతలు సంతాపం వ్యక్తం చేశారు.

నేటి నుంచి రిఫరీ, రిఫ్రెషర్స్ సెమినార్

విజయనగరం: న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయనగరం జిల్లా కేంద్రంలో రెండు రోజుల పాటు నేషనల్ తైక్వాండో రిఫరీ, రిఫ్రెషర్స్ సెమినార్ శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సిహెచ్.వేణుగోపాలరావు గురువారం తెలిపారు.

వీధుల్లో ఏనుగుల గుంపు

- ఆహారం కోసం వెతుకులాట

భామిని: మండలంలోని తాలాడ గ్రామస్తులకు ఏనుగుల గుంపు కొత్త సమస్య తెచ్చి పెట్టింది. గురువారం నేరుగా నాలుగు ఏనుగుల గుంపు గ్రామంలోకి ప్రవేశించి ఆహారం కోసం వెదుకులాట ప్రారంభించాయి. వీధుల్లో తిరుగుతూ ఇంటి పెరళ్లలో పెంచుకుంటున్న మొక్కలను ధ్వంసం చేసి తినివేశాయి. ఇంటి పెరటిలోకి ఏనుగులు ప్రవేశించడంతో గ్రామప్రజలు పరుగు తీశారు. పూరిళ్లు, వంటపాకలను తిరగేస్తాయని భయపడి కేకలు వేశారు. దీంతో స్థానిక సర్పంచ్ ఎరుకుమజ్జి ప్రభావతి, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎరుకుమజ్జి పాపినాయుడుల సమాచారం మేరకు ఫారెస్టు అధికారులు, ట్రాకర్లు అప్రమత్తమై గ్రామానికి వచ్చి ఏనుగులను దారి మళ్లించి గ్రామ సమీపంలోని తోటలకు తరలించారు. అనంతరం గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.



గ్రామంలోని వీధి సందుల్లో ఏనుగుల గుంపు

పాడిందే పాడరా..!

- ప్రజల్లో భయాందోళన కలిగిస్తున్న ప్రతిపక్షాలు
- అక్కరకు వచ్చే చట్టంపై దుష్ప్రచారం
- నాడు భూముల రీసర్వేపైనా ఇవే తరహా ఆరోపణలు

వినరా సోదరా..అమాయకపు అన్నదాతా..అంటూ రాష్ట్రంలోని ప్రతిపక్షాలు, వారి అనుకూల మీడియా మరో దుష్ప్రచారానికి తెరతీశాయి. మేము చెప్పిందే వేదం..పాడిందే పాట..మీరంతా నమ్మి తీరాల్సిందేనంటూ కొత్త రాగం ఎత్తుకున్నాయి. భూ యజమానులకు అక్కరకు వచ్చే చట్టంపై కట్టుకథలు అల్లుతూ అభూత కల్పనకు శ్రీకారం చుట్టాయి. వాస్తవంగా భూ యజమానులకు భరోసా కలిగించే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై విషప్రచారంతో మభ్యపెట్టి భూ యజమానుల్లో నిరుత్సాహం నింపేందుకు తీవ్రంగా యత్నిస్తున్నాయి.

సాక్షి, పార్వతీపురం మన్యం:

రాష్ట్రంలో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై ప్రతిపక్షాలు తీవ్ర ఆరోపణలు చేస్తున్నాయి. ఈ చట్టం వస్తే భూములు పోతాయంటూ ప్రజల్లో భయాందోళన రేపుతున్నాయి. సామాజిక మాధ్యమాల్లోనూ తప్పుడు ప్రసారాలు చేస్తున్నాయి. ప్రభుత్వం మాత్రం ఈ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌తో భూయజమానులకు మరింత కచ్చితమైన భరోసా వస్తుందని చెబుతోంది. వాస్తవానికి వ్యవసాయ, వ్యవసాయేతర, ఇతర భూములకు సంబంధించి 30కిపైగా రికార్డులు ఉన్నాయి. అవి కూడా బ్రిటిష్ కాలానికి సంబంధించినవి. దీనివల్ల గ్రామాల్లో భూవివాదాలు సంభవిస్తే.. 90 శాతం మంది ప్రజలు వాటిని స్థానికంగానే పరిష్కరించుకుంటున్నారు. భూవివాద కేసులపై కోర్టుకు వెళ్తే ఏళ్ల తరబడి తిరగాల్సి వస్తోంది. సరైన రికార్డులు లేకపోవడం, ఉన్నవి కూడా తప్పుల తడకగా ఉండడమే ఇందుకు కారణం. ఈ సమస్యలను గుర్తించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 'వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష కింద' సమగ్ర భూసర్వేకు శ్రీకారం చుట్టింది. జిల్లాలోని 15 మండలాల పరిధిలో 965 రెవెన్యూ గ్రామాలుండగా.. మొదటి విడత 95, రెండో విడత 153, మూడో విడత 107 గ్రామాలు చొప్పున సర్వే నిర్వహించారు. రోవర్, డ్రోన్లతో గ్రామ, మండల సరిహద్దులను నిర్ధారించి, అత్యాధునిక పరికరాలతో పొలాల సరిహద్దులను గుర్తించి, సర్వే రాళ్లను అమర్చుతున్నారు. దీనివల్ల ఏళ్ల క్రితం నాటి



రికార్డులకు, వివాదాలకు మోక్షం కలుగుతోంది.

భూమిపై పక్కా యాజమాన్యపు హక్కు..

భూమిపై ఉన్న వివాదాలను పరిష్కరించి, వారసులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చేయడమే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ముఖ్య ఉద్దేశమని నిపుణులు చెబుతున్నారు. భూముల లెక్కలు తేలిన తర్వాత ఎలాంటి వివాదమూ లేని వాటిని టైటిల్ రిజిస్టర్‌లో నమోదు చేస్తారు. వివాదాలు ఉన్న భూముల వివరాలను ఓ ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేస్తారు. ఆ వివాదాలు పరిష్కరించేందుకు జిల్లాస్థాయిలో ఒక ట్రిబ్యునల్, రాష్ట్ర స్థాయిలో మరో ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేస్తారు. రాష్ట్ర ట్రిబ్యునల్ తీర్పు మీద అభ్యంతరాలుంటే హైకోర్టును కూడా ఆశ్రయించవచ్చు. ఈ చట్టం ప్రకారం భూయజమానికి ఒకసారి నిర్ధారిస్తే అదే ఖరారవుతుంది. భవిష్యత్తులో అధికార, రాజకీయ బలంతో ఆ భూమిని కబ్జా చేయడం గానీ, కోర్టుకు వెళ్లే అవకాశం గానీ ఉండదు. యజమాని ఎక్కడున్నా భూమికి రక్షణ ఉంటుంది. ప్రతి మూడు నెలలకోసారి మొబైల్ ఫోన్‌లోనే భూమి వివరాలను పరిశీలించుకోవచ్చు. వ్యవసాయ భూమి కొనుగోలు చేయాలంటే రిజిస్ట్రేషన్ చట్టం ప్రకారం రిజిస్ట్రేషన్ ఫీజు, స్టాంప్‌డ్యూటీ చెల్లించి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో దస్తావేజు చేయించుకోవాలి. ఆ తర్వాత ఆర్‌వోఆర్ చట్టం రిజిస్ట్రేషన్ ప్రకారం తహసీల్దార్ విచారణ చేసి, రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయాలి. కొత్త చట్టం ప్రకారం రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ ఒకేచోట, ఒకేసారి జరుగుతాయి. భూమి కొనుగోలు చేసిన వ్యక్తికి సర్టిఫికెట్ జారీ చేస్తారు. ఈ సర్టిఫికెట్ ఉంటే హక్కులకు సంపూర్ణ హామీ ఉన్నట్లే. పైలెట్ ప్రాజెక్టుగా కొన్ని రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనే దీన్ని అమలు చేస్తున్నారు. దీని వల్ల భూమి వివరాలు నమోదు చేసిన తర్వాత జిరాక్స్ పత్రాలు ఇస్తున్నారు. దీన్నే ప్రతిపక్షాలు భూతద్దంలో పెట్టి ప్రజలను మభ్యపెడుతున్నాయని అధికార పార్టీ నేతలు మండిపడుతున్నారు.

అపోహలు సృష్టిస్తున్నారు



రాజకీయాలను దృష్టిలో పెట్టుకుని ల్యాండ్ టైటిలింగ్‌పై అపోహలు సృష్టిస్తున్నారు. ఈ చట్టంలో ఎటువంటి లొసుగులు లేవు. సర్వే ప్రక్రియ పూర్తి కాకుండా ఎలా చట్టం అమలవుతుంది. ఎప్పుడో బ్రిటిష్‌వారి హయాంలో సర్వే జరిగింది. మళ్లీ భూ సమస్యలు పరిష్కరించేలా ఈ ప్రభుత్వం చొరవ చూపి సమగ్ర భూ సర్వే చేయిస్తోంది.

–ఎస్.కాంతారావు, గిరిజన సంఘం నాయకుడు, దేవనాపురం, సీతంపేట

ప్రగతి పథంలో విజయనగరం



జిల్లా ప్రజల ఆరోగ్య ప్రదాయిని ప్రభుత్వ మెడికల్ కళాశాల

- గతంలో ఎన్నడూ లేని విధంగా ఐదేళ్లలో అభివృద్ధి కార్యక్రమాలు
- కార్పొరేషన్ హోదా తగ్గట్లు నగర సుందరీకరణ, మౌలిక సదుపాయాల కల్పన
- విశాలంగా రూపుదిద్దుకున్న నగరంలోని ప్రధాన రహదారులు
- ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోన్న నగరం నడిబొడ్డున గల మహిళా పార్క్
- పేదలకు ఉచితంగా ఆహారం అందించేందుకు ఫుడ్ బ్యాంక్‌లు
- నాడు–నేడు పథకంలో ప్రభుత్వ విద్య, వైద్య రంగాలకు మహర్దశ

విజయనగరం: కార్పొరేషన్ హోదా దక్కించుకున్న విజయనగరం అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 58 నెలల పాలనలో అన్నిరంగాల్లోనూ ప్రగతి సాధించింది. ప్రభుత్వ కృషితో కార్పొరేషన్ స్థాయికి తగ్గ సదుపాయాలు సమకూరాయి. నగరంలోని కూడళ్లన్నీ అందంగా ముస్తాబై నగరానికి వచ్చేవారిని ఆకర్షిస్తున్నాయి. చెరువు గట్లు పార్కులుగా రూపుదిద్దుకున్నాయి. నగర ప్రజలకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. రోడ్ల విస్తరణ, శివారు కాలనీలకు తాగునీటి సదుపాయం కల్పన, సెంట్రల్ లైటింగ్, ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు, మహిళా పార్కు, గంటస్తంభం, మూడులాంతర్ల కూడలి ఆధునికీకరణ తదితర అభివృద్ధి పనులతో నగరం కొత్తశోభను సంతరించుకుంది. విద్యలనగరం కాస్త ప్రగతి నగరంగా విరాజిల్లుతోంది.

నగరంలో ప్రగతి బాటలు


విజయనగరం కార్పొరేషన్ పరిధిలోని సచివాలయం

- నగరంలోని కలెక్టరేట్ కూడలి నుంచి ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచి వరకు 66 అడుగులు ఉన్న 2 లైన్ల రోడ్డు మార్గాన్ని రూ.6.50 కోట్లతో 4 లైన్‌లు రోడ్డుగా విస్తరించే పనులు పూర్తి చేశారు.
- నగరంలోని నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే బాలాజీ జంక్షన్ నుంచి మయూరి జంక్షన్‌కు వెళ్లే 1.2 కిలోమీటర్ల పొడవుగల 80 అడుగుల ట్యాంక్ బండ్ రోడ్డును రూ. 7 కోట్ల వ్యయంతో 100 నుంచి 120 అడుగుల వెడల్పుతో 6 లైన్లుగా విస్తరించారు.
- రూ.1.02 కోట్లతో బాలాజీ జంక్షన్ నుంచి గంటస్తంభం కూడలి వరకు ప్రధాన రహదారి నిర్మించారు.
- రూ.1.70 కోట్లతో ఎంఆర్ కళాశాల కూడలి నుంచి ఎస్‌బీఐ మెయిన్‌బ్రాంచి రోడ్డు అభివృద్ధి చేశారు.

నాడు- నేడుతో పాఠశాలలకు మహర్దశ

నియోజకవర్గంలో మొత్తం పాఠశాలల సంఖ్య: **123**
ఉన్నత పాఠశాలల సంఖ్య: **16**
ప్రాథమికోన్నత పాఠశాలల సంఖ్య: **9**
ప్రాథమిక పాఠశాలల సంఖ్య : **98**
ఆయా పాఠశాలల్లో చదువుతున్న మొత్తం విద్యార్థుల సంఖ్య: **15,724**
నాడు–నేడు రెండు దశల్లో ఎంపిక చేసిన పాఠశాలల సంఖ్య: **92**
నాడు–నేడు కార్యక్రమంలో పాఠశాలల అభివృద్ధి ఖర్చు చేసిన మొత్తం: రూ.**26.42** కోట్లు
మండల పరిధిలో పాఠశాలల కోసం ఖర్చు చేసింది : రూ.**7** కోట్లు
విజయనగరం కార్పొరేషన్ పరిధిలో ఖర్చు చేసింది: రూ.**19.42** కోట్లు


పాఠశాలలో బెంచీలపై కూర్చుని విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు

మహిళల కోసం ప్రత్యేకంగా పార్కు

- విజయనగరంలో ప్రత్యేకంగా మహిళా పార్క్
- రూ. 2 కోట్ల వ్యయంతో ఆహ్లాదంతో పాటు ఆరోగ్యాన్ని పంచేలా సదుపాయాలు
- 1.75 ఏకారాల విస్తీర్ణంలో ప్రత్యేక జిమ్, స్విమ్మింగ్ పూల్‌ల ఏర్పాటు
- చిన్న పిల్లలు ఆడుకునేందుకు ఆట పరికరాలు ఏర్పాటు
- అమృత్ పథకం, సాధారణ నిధులతో సుందరంగా పార్క్ పరిసరాలు
- రాష్ట్రంలోనే మొదటి మహిళా పార్క్‌గా గుర్తింపు

- రూ.40 లక్షలతో దాసన్నపేట రైతు బజారు విస్తరణ పనులు పూర్తి చేశారు.
- రింగ్ రోడ్ నుంచి దాసన్నపేట వెళ్లే ఎఫ్‌సీ గోదాముల రోడ్డును రూ.29 లక్షలతో అభివృద్ధి చేశారు.
- రూ. కోటి వ్యయంతో రింగ్‌రోడ్డు నుంచి శిల్పారామం వెల్లే మార్గంలో బీటీ రోడ్డు నిర్మించారు.
- రూ.1.32 కోట్లతో మయూరి కూడలి నుంచి వైఎస్సార్ కూడలి వరకు గల రైల్వే స్టేషన్ రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు.
- నగరంలోని ఆర్అండ్‌బీ కూడలి నుంచి అయ్యన్నపేటకు వెళ్లే 1.3 కిలోమీటర్ల పొడవు గల రోడ్డులో రూ.2 కోట్ల వ్యయంతో విస్తరణ పనులు చేపట్టగా.. 60 అడుగుల నుంచి 80 అడుగులు మేర విస్తరించారు. విస్తరణలో భాగంగా సెంట్రల్ డివైడర్ ఏర్పాటు చేయగా... విజయనగరం కార్పొరేషన్ ఆధ్వర్యంలో రూ.39 లక్షలతో 36 విద్యుత్ స్తంభాలు వేసి వీధి దీపాలు ఏర్పాటు చేశారు. ఈ రోడ్డు విస్తరణ పనులు పూర్తికావటంతో నగరం నుంచి రాకపోకలు సాగించే 10 గ్రామాల ప్రజలకు ఉపయుక్తంగా మారింది.

ప్రజారోగ్య పరిరక్షణకు పెద్ద పీట

మొత్తం అర్బన్ హెల్త్ సెంటర్‌ల సంఖ్య: **12**
2019 సంవత్సరానికి ముందు ఉన్నవి : **5**
వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మంజూరైనవి : **7**
ఒక్కో భవన నిర్మాణానికి ఖర్చు చేస్తోన్న మొత్తం :రూ.**1.02** కోట్లు
7 భవనాల నిర్మాణానికి మంజూరైన మొత్తం: సుమారు రూ.**7.15** కోట్లు
ఇప్పటి వరకు ప్రారంభమైన అర్బన్ హెల్త్ సెంటర్‌లు : **5**
ప్రారంభానికి సిద్ధంగా ఉన్నవి : **2**


గాజులరేగలోని వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్

చెరువు గట్టు అదిరేట్టు...


చెరువు గట్టుపై ఏర్పాటు చేసిన వాటర్ ఫౌంటైన్

- రూ.1.60 కోట్లతో నగర శివారులోని నీలాటి చెరువును అభివృద్ధి చేశారు. చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మాణం చేపట్టడంతో పాటు రెండు ఫౌంటైన్‌లు ఏర్పాటు చేశారు. ప్రధాన రహదారికి అనుకున్న సుందరంగా విద్యుత్ దీపాలంకరణ చేశారు.
- నగరం నడిబొడ్డున గల అయ్యకోనేరును రూ.1.65 లక్షలతో సుందరంగా తీర్చిదిద్దారు.

నగర సుందరీకరణకు పెద్ద పీట:

- గోకుల్ పార్క్ అభివృద్ధికి రూ.**8** లక్షలు
- గురజాడ సర్కిల్ సుందరీకరణ : రూ.**13.98** లక్షలు
- అంబేడ్కర్ జంక్షన్ అభివృద్ధి : రూ.**13.05** లక్షలు
- ఐస్‌ఫ్యాక్టరీ జంక్షన్ దండి మార్చ్ : రూ.**30** లక్షలు
- ఎత్తుబ్రిడ్జి సుందరీకరణ : రూ.**17.57** లక్షలు
- జ్యోతీరావుపూలే కూడలి అభివృద్ధి రూ. **47.35** లక్షలు
- ఎన్‌టీఆర్ జంక్షన్ అభివృద్ధి : రూ.**11.76** లక్షలు
- రూ. **8** లక్షలతో మయూరి జంక్షన్‌లో ప్రజలను ఆకట్టుకునేలా కప్ అండ్ కెటిల్ ను ఏర్పాటు చేశారు.
- రూ.**36** లక్షలతో మయూరి జంక్షన్ నుంచి అంబేద్కర్ జంక్షన్ వరకు సెంట్రల్ ఏర్పాటు చేశారు.
- రూ.**31** లక్షలతో మయూరి జంక్షన్ నుంచి వైఎస్సార్ జంక్షన్ వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు.


ఆహ్లాదాన్ని పంచేలా దాసన్నపేట- జమ్ము ప్రధాన రహదారి

- రూ.65 లక్షలతో నగరంలోని బుచ్చన్న కోనేరు అభివృద్ధి చేశారు. చెరువును శుభ్రం చేసి వాకింగ్ ట్రాక్ ఏర్పాటు, జిమ్ ఎక్విప్‌మెంట్‌లను ఏర్పాటు చేశారు.
- రూ.1.30 కోట్లతో అచంటా గార్డెన్స్ అభివృద్ధి చేశారు. మూడు ఫౌంటైన్‌లు ఏర్పాటు చేశారు. వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేశారు. ఆహ్లాదాన్ని పంచేలా గ్రీనరీ ఏర్పాటు చేశారు. పిల్లలు ఆడుకునేందుకు ఆట పరికరాలు ఏర్పాటు చేశారు. పార్కు పరిసరాలను అందంగా కనిపించేలా విద్యుత్‌దీపాలంకరణ చేశారు. బుద్ధుడి విగ్రహం, ఐ లవ్ విజయనగరం పేరిట రెండు ఐకాన్‌లు ఏర్పాటు చేశారు.
- అయ్యన్నపేట కోమటి చెరువును రూ.55 లక్షలతో అభివృద్ధి చేశారు.

2019 ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు కార్పొరేషన్ పరిధిలోని సొంతిళ్లు లేని నిరుపేదలకు వేల సంఖ్యలో ఇళ్ల స్థలాలు మంజూరు చేయడంతో పాటు ఇళ్లు నిర్మించుకునేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సహాయ, సహకారాలు అందించింది.

ప్రభుత్వ మెడికల్ కళాశాల కళ సాకారం

విజయనగరం ప్రజల చిరకాల స్వప్నం ప్రభుత్వ మెడికల్ కళాశాల కళ సాకారమైంది. గాజులరేగలో 70 ఎకరాల విస్తీర్ణంలో రూ.500 కోట్ల వ్యయంతో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం శంకుస్థాపన చేసిన అనతి కాలంలో నిర్మాణ పనులు పూర్తి చేసి కళాశాలను ప్రారంభించింది. ప్రస్తుతం కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు తరగతులు ప్రారంభమయ్యాయి. తద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు విజయనగరంలో అందుబాటులోకి వచ్చాయి.

రూ.10 కోట్లతో తాగు నీటి సమస్య పరిష్కారానికి చర్యలు


దాసన్నపేట ప్రాంతంలో నిర్మించిన వాటర్ ట్యాంక్

50 డివిజన్‌లుగా విస్తరించిన విజయనగరం కార్పొరేషన్‌లో ప్రజలు తాగు నీటి కోసం ఇబ్బందులు పడకుండా చేపట్టిన చర్యలు సత్ఫాలితాలునిచ్చాయి. ఇందులో భాగంగా గాజురేగ, ధర్మపురి, కె.ఎల్.పురం, బాలాజీ నగర్, దాసన్నపేట, ఫూల్‌బాగ్ ప్రాంతాల్లో రూ.10 కోట్లతో 45 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన 11వాటర్ ట్యాంక్‌లు నిర్మించి ఆయా ప్రాంత ప్రజలకు కుళాయిల ద్వారా తాగు నీటిని సరఫరా చేస్తున్నారు. 2019 ఎన్నికలకు ముందు నగర వ్యాప్తంగా 18000 కుళాయిలు ఉండగా.... గడిచిన నాలుగున్నరేళ్లలో నూతనంగా 16000 కుళాయి కనెక్షన్‌లు మంజూరు చేసి నీటిని సరఫరా చేస్తున్నారు.

- అమృత్ 2.0 లో భాగంగా ముషిడిపల్లి రక్షిత మంచి నీటి పథకం నుంచి విజయనగరం వరకు 23 కిలోమీటర్ల పొడవున ఉన్న పైప్‌లైన్‌లను రూ.63 కోట్లతో మార్పు చేసేందుకు నిధులు మంజూరు చేశారు.

పేదలకు గృహయోగం

వేల సంఖ్యలో ఇళ్ల స్థలాలు మంజూరు చేయడంతో పాటు ఇళ్లు నిర్మించుకునేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సహాయ, సహకారాలు అందించింది. నగరానికి సమీపంలోని గుంకాలం గ్రామంలో 397 ఎకరాల్లో 10, 360 మంది నగర ప్రజలకు ఇళ్ల పట్టాలను అందజేసింది. మండల పరిధిలోని కొండకరకాం గ్రామంలో 85 ఎకరాలను సేకరించి 2,377 పట్టాలు అందజేయగా.... సారికలో వేసిన మరో కాలనీలో 3,403 మంది లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. ఆయా కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు చేపడుతున్నారు.

ఫుడ్ బ్యాంక్‌ల ద్వారా పేదలకు ఉచిత భోజనం

గత టీడీపీ ప్రభుత్వం అన్నా క్యాంటిన్‌ల పేరిట రూ.5కు భోజనం వడ్డించగా... 50 మందికి భోజనం పెట్టి 100 మందికి పెట్టినట్లు లెక్కలు రాసుకుని స్థానిక నేతలు అక్రమాలకు పాల్పడ్డారు. ప్రస్తుత ప్రభుత్వ ప్రజాప్రతినిధులు, దాతలు నగరంలోని ఆరు ప్రాంతాల్లో ఫుడ్‌బ్యాంక్‌లు ఏర్పాటు చేసి మధ్యాహ్నం, రాత్రి వేళల్లో అనాథలు, పేదలు, నగరానికి వచ్చేవారికి ఉచితంగా భోజనం వడ్డిస్తున్నారు.

2019 నుంచి విజయనగరం నియోజకవర్గంలోని అర్హులైన లబ్ధిదారులకు వివిధ పథకాల రూపంలో జరిగిన లబ్ధి వివరాలు...

పథకంపేరు	లబ్ధిదారుల సంఖ్య	జరిగిన లబ్ధి (రూ.కోట్లలో)
రైతు భరోసా	5,236	33.27
సున్నా వడ్డీ పంట రుణాలు	1336	0.15
డాక్టర్ వైఎస్సార్ ఫ్రీ క్రాప్ ఇన్సూరెన్స్	21	0.01
వైఎస్సార్ యంత్ర సేవ	90	0.39
వైఎస్సార్ పశునష్ట పరిహార పథకం	392	1.17
వైఎస్సార్ పశుబీమా	295	0.045
జగనన్న గోరుముద్ద	77,695	12.76
జగనన్న అమ్మఒడి	92,057	138.09
జగనన్న విద్యాకానుక	17,209	12.56
వైఎస్సార్ పెంఛన్ కానుక	29,410	385.83
వైఎస్సార్ చేయూత	33,140	67.29
జగనన్న తోడు వడ్డీ	4,146	0.07
జగనన్న తోడు	23,834	23.87
వైఎస్సార్ సున్నా వడ్డీ	26476	28.12
బ్యాంక్ లింకేజీ	13,4952	914.37
వైఎస్సార్ ఆసరా	48593	90.10
ఉన్నతి	323	రూ.1.40
వైఎస్సార్ బీమా	603	9.32
స్త్రీ నిధి	1408	25.39
జగనన్న విద్యా దీవెన	19,838	39.72
జగనన్న వసతి దీవెన	18,698	18.54
పాస్టర్‌లకు గౌరవ వేతనం	20	0.93
ఇమామ్స్, మొజామ్స్ గౌరవవేతనం	18	1.74
డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ	33,670	68.02
వైఎస్సార్ సంపూర్ణ పోషణ	13,618	16.12
జననీ సురక్ష యోజన	10,038	0.92
వైఎస్సార్ వాహన మిత్ర	10,056	10.06
జగనన్న చేదోడు	1965	7.,21
వైఎస్సార్ కాపు నేస్తం	880	4.63
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	1411	3.95
వైఎస్సార్ నేతన్న నేస్తం	1	0.01
పీఎం స్వనిధి	14102	15.77

ప్రభుత్వ డిగ్రీ కళాశాల కల సాకారం

విజయనగరం జిల్లా కేంద్రంగా ఆవిర్భవించినప్పటి నుంచి 2019 సంవత్సరం వరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేదు. వాస్తవానికి నగరంలో మాన్సాస్ విద్యా సంస్థలు ఉండటంతో గత పాలకులు ఎవ్వరూ ప్రభుత్వ పరంగా ఉన్నత విద్యనందించే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టలేదు. ఈ నేపథ్యంలో విజయనగరం ఎమ్మెల్యేగా ఎన్నికైన కోలగట్ల వీరభద్రస్వామి అప్పటి దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి హయాంలో ప్రభుత్వం జూనియర్ కళాశాలను మంజూరు చేయగా... 2019 ఎన్నికల అనంతరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల కలను సాకారం చేశారు. ప్రస్తుతం ఈ రెండు కళాశాలల్లో వందలాది మంది పేద, సామాన్య విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.


సచివాలయంలో ప్రజలకు సేవలందిస్తున్న సిబ్బంది


అందంగా ముస్తాబైన విజయగనరం కార్పొరేషన్ పరిధి కొత్తపేట కెపి గొల్ల ప్రాథమిక పాఠశాల


ఐస్‌ఫ్యాక్టరీ కూడలిలోని దండి మార్చ్


అభివృద్ధి చేసిన నగరంలోని నీలాటి చెరువు పరిసరాలు

జగనన్న మహిళా పక్షపాతి...

- మహిళల ఆత్మగౌరవాన్ని పెంచిన ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించండి
- గర్భాం ఎన్నికల ప్రచార సభలో మంత్రి బొత్స సత్యనారాయణ
- ఏమి చేసారని టీడీపీ నాయకులు ఓటు అడుగుతున్నారు : జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు


గర్భాం ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతున్న మంత్రి బొత్ససత్యనారాయణ

మెరకముడిదాం: ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతని.. మహిళల ఆత్మగౌరవాన్ని పెంచిన ప్రభుత్వాన్నే మళ్లీ గెలిపించాలని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. మెరకముడిదాం మండలంలోని నరసయ్యపేట, గర్భాం, సింగవరం, ఇప్పలవలస గ్రామాల్లో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌లతో కలిసి గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో మంత్రి బొత్స మాట్లాడుతూ, మెరకముడిదాం మండలంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ప్రతి గ్రామానికీ తారురోడ్లను నిర్మించుకున్నామన్నారు. అలాగే నరసయ్యపేట గ్రామానికి పంచాయతీ హోదా కలిపించామని తెలిపారు. గర్భాం గ్రామంలో అనేక బీటీ రోడ్లను నిర్మించడంతో పాటు 'నాడు – నేడు' పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసిన ఘతన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనన్నారు. అలాగే తాగునీటి సమస్య పరిష్కారానికి ఇంటింటికీ కుళాయిలు వేశామన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధిని కాంక్షిస్తూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఆసరాతో పాటు అమ్మఒడి, జగనన్న చేదోడు, తదితర సంక్షేమ పథకాలు అమలు చేశారని చెప్పారు. సంక్షేమ పథకాలతో ప్రజలు బాగుపడడాన్ని చూసి ఓర్వలేక చంద్రబాబు అండ్ కో జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై బురద జల్లుతోందని మండిపడ్డారు. టీడీపీ నాయకుల మోసపూరిత హామీలు, బూటకపు మాటలు నమ్మవద్దని సూచించారు. మంచి చేసే ప్రభుత్వాన్నే మళ్లీ గెలిపించాలని కోరారు.

రాష్ట్రానికి ఏం చేశారు..

- జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు


గర్భాంలో మాట్లాడుతున్న జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

టీడీపీ నాయకులకు ఎన్నికల సమయంలోనే ప్రజలు గుర్తుకువస్తారని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మండలానికి ఏం చేశారని ఓట్లు అడగడానికి వస్తున్నారని ప్రశ్నించారు. గర్భాంలో మోడల్ స్కూల్‌తో పాటు పెట్రోల్ బంక్ నుంచి గ్రామం వరకు బీటీ రోడ్డును, బోడందొరవలస నుంచి చెల్లాపురం వరకు, అలాగే లెంకపేటకు బీటీ రోడ్లు ఎవరి హయాంలో జరిగాయో ప్రజలు గుర్తించాలన్నారు. ఈ గ్రామంలో ఉన్న నాయకులకే పలుమార్లు ఎంపీపీ పదవులు ఇచ్చి గర్భాం గ్రామానికి గుర్తింపు తెచ్చింది మంత్రి బొత్ససత్యనారాయణ అని గుర్తు చేశారు. ధైర్యంగా ఓట్లు అడిగే దమ్ము మంత్రి బొత్స సత్యనారాయణకు , ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికే ఉందన్నారు. వితంతువులు, దివ్యాంగులకు వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేస్తుండటాన్ని చంద్రబాబు జీర్ణించుకోలేక వారిపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి తన శాడిజాన్ని చాటుకున్నారని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా బొత్స సత్యనారాయణను, విజయనగరం పార్లమెంట్ సభ్యుడిగా బెల్లాన చంద్రశేఖర్‌ను గెలిపించాలని కోరారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని గెలిపించండి

- ఎంపీ బెల్లాన


సింగవరంలో ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

రాష్ట్రంలో మునుపెన్నడూ లేని విధంగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి రాష్ట్ర ప్రజల మనస్సును దోచుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్నే మళ్లీ గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. మహిళల బ్యాంక్ ఖాతాలకు సంక్షేమ పథకాల సొమ్ము జమ చేసి వారిని ఆర్థికంగా బలోపేతం చేశారని చెప్పారు. మే 13న జరగబోయే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటెయ్యాలని కోరారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్‌వీ రమణ రాజు, ఎంపీపీ తాడ్డి కృష్ణవేణి, తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల విశ్వేశ్వరరావు, బూర్లె నరేష్‌కుమార్, స్థానిక సర్పంచ్ గాబ్రియేల్, నాయకులు సత్తారు జగన్‌మోహన్‌రావు, సత్తారు శ్రీనివాసరావు, పప్పల కృష్ణమూర్తి, పలువురు ఎంపీటీసీలు, పలువురు సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ దారులకు కష్టాలు.. చంద్రబాబుదే ఆ పాపం


రాజాం ఎస్‌బీఐ సీఎస్పీ సెంటర్ వద్ద పింఛన్ లబ్ధిదారుల నిరీక్షణ

రాజాం: పింఛన్ దారులకు 58 నెలలుగా ప్రతి నెలా ఒకటో తేదీన ఇంటి వద్దనే వలంటీర్లు పింఛన్లు అందజేయడం చంద్రబాబుకు కన్నుకుట్టుంది. ఎన్నికలను బూచిగా చూపి వలంటీర్ల సేవలకు ఆటంకం కల్పించారు. అవ్వాతాతలకు ఆవేదన మిగిల్చారు. మే నెల పింఛన్ డబ్బులు బ్యాంకు ఖాతాలకు జమ చేయడంతో లబ్ధిదారులు బ్యాంకుల వద్ద పడిగాపులు కాస్తున్నారు. తమ ఉసురు చంద్రబాబుకు తగులుతుందంటూ పింఛన్‌దారులు శాపనార్థాలు పెడుతున్నారు.


రాజాం యూనియన్ బ్యాంకులో పింఛన్ లబ్ధిదారుల రద్దీ

చాలా ఇబ్బంది పడుతున్నాం



గతంలో కడుపులోచల్ల కదలకుండా ఇంటి వద్దనే పింఛన్ అందుకునేవారం. వలంటీర్ల సేవలను అడ్డుకోవడం వల్లే మాకు ఈ కష్టాలు. బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. మా లాంటి వృద్ధులపై చంద్రబాబుకు కక్ష సాధింపు తగదు.
– కొప్పల లక్ష్మం, ఉనుకూరు, రేగిడి మండలం

మా ఉసురు తగులుతుంది



వలంటీర్లతో పింఛన్లు పంపిణీ చేయకుండా చేసిన వారికి మా ఉసురు తగులుతుంది. ముసలివారు ఇబ్బంది పడతారన్న జ్ఞానం చంద్రబాబుకు లేకపోవడం విచారకరం. వ్యయప్రయాసలు పడి బ్యాంకుకు రావాల్సి వచ్చింది.
– మక్క అప్పలనరసమ్మ, రాజాం